సాక్షి మహబూబాబాద్

సోమవారం । 21 । ఏప్రిల్ । 2025



ఆదివాసీలపై పెరిగిన దాడులు

కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆదివాసీలపై దాడులు, లైంగికదాడులు పెరిగాయని ఏఐసీసీ సెక్రటరీ విశ్వనాథన్ పెరుమాళ్ అన్నారు. - 8లో▸



'పట్టు'.. రాయితీ కొట్టు..

రైతులు ఆర్థికాభివృద్ధి సాధించడమే ధ్యేయంగా ప్రభుత్వం మల్బరీ సాగు, పట్టు పరిశ్రమను ప్రోత్సహిస్తోంది. - 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం $38.2^0/28.7^0$

జిల్లాలో ఉదయం సాధారణంగా ఉంటుంది. మధ్యాహ్నం వేళ ఎండతోపాటు ఉక్కపోత ఉంటుంది. సాయంత్రం సమయంలో ఆహ్లాదంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ



మరిపెడ: మరిపెడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి భూక్య రవిరాథోడ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రి పరిసరాలు, ఫార్మసీస్టోర్, వ్యాక్సినేషన్ రూమ్, అటెండెన్స్ రిజిస్టర్, అవుట్ పేషెంట్, ఇన్ పేషెంట్ రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వేసవిలో ఎవరైనా వడదెబ్బ తగిలి ఆస్పత్రికి వస్తే వెంటనే ప్రథమ చికిత్స చేసి జిల్లా ఆస్పత్రికి రెఫర్ చేయాలని సూచించారు. వడదెబ్బపై ప్రతీ గ్రామంలో అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని చెప్పారు. మందుల కొరత లేకుండా చూడాలని అన్నారు.

'ఓపెన్' పరీక్షలు ప్రారంభం

మహబూబాబాద్ అర్బన్: ఓపెన్ ఇంటర్, పదో తరగతి పరీక్షలు ఆదివారం ప్రారంభమైనట్లు డీఈఓ రవీందర్‌రెడ్డి తెలిపా రు. జిల్లా వ్యాప్తంగా ఇంటర్‌లో 422 మందికి 372 మంది విద్యార్థులు హాజరయ్యారని, పదిలో 558 మందికి 493 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారాన్నారు. ఎక్కడ ఎ లాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా పరీక్షలు జరిగినట్లు పేర్కొన్నారు.

తహసీల్దార్ల బదిలీ

కురవి/గార్ల/దంతాలపల్లి: జిల్లాలోని పలు మండలాల తహసీల్దార్లను బదిలీ చేస్తూ కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. సీరోలు తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఆర్.శారద గార్లకు బదిలీ అయ్యారు. సీరోలుకు తహసీల్దార్ ఎస్‌వీ నారాయణమూర్తి రానున్నారు. అలాగే కురవి తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న యు.సునీల్‌కుమార్‌ను దంతాలపల్లికి బదిలీ చేశారు. కురవికి గూడూరు తహసీల్దార్ ఎస్.శ్వేత బదిలీపై రానున్నారు. దంతాలపల్లి తహసీల్దార్ రాజేశ్వర్‌ను గూడూరుకు బదిలీ చేశారు.

నేటి నుంచి రిఫ్రెషర్ కోర్సు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ ప్రభుత్వ పాలనాశాస్త్రం, మానవ వనరుల నిర్వహణ శాస్త్ర విభాగంలోని పరిశోధకులకు రీసెర్చ్ మెథడాలజీపై ఈనెల 21 నుంచి రిఫ్రెషర్ కోర్సు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. వారం రోజులపాటు చేపట్టే ఈ తరగతుల్లో విశేష పరిశోధన అనుభవం కలిగిన సీనియర్ ప్రొఫెసర్లతో బోధన ఉంటుందని, రీసెర్చ్ స్కాలర్స్ సద్వినియోగం చేసుకోవాలని ఆ విభాగం అధిపతి ఆచార్య పెదమళ్ల శ్రీనివాస్‌రావు ఒక ప్రకటనలో కోరారు.

హేమాచలక్షేత్రంలో భక్తుల సందడి



మంగపేట: మండల పరిధిలోని మల్లూరు హేమాచల లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. ఆలయంలోని స్వయంభు లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకునేందుకు సుదూర ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. ఉదయాన్నే గుట్టపైకి చేరుకున్న భక్తులు ఆలయ ప్రాంగణంలో సహజసిద్ధంగా వెలిసిన పవిత్ర చింతామణి జలపాతం వద్ద పుణ్య స్నానాలు ఆచరించారు. అత్యంత భక్తిశ్రద్ధలతో ఆలయంలోని స్వయంభు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ పూజారులు శేఖర్‌శర్మ, పవన్‌కుమార్, ఈశ్వర్‌చంద్ స్వామివారికి తిలతైలాభిషేకం పూజలు నిర్వహించారు. ఈ పూజలో పాల్గొన్న భక్తులు స్వామి నిజరూప దర్శనం చేసుకుని పులకించారు. అనంతరం ఆలయానికి వచ్చిన భక్తుల పేరిట గోత్రనామాలతో ప్రత్యేక అర్చనలు జరిపించారు. సంతానం కోసం స్వామివారి నాభిచందన ప్రసాదం స్వీకరించేందుకు వచ్చిన దంపతులకు అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి నాభిచందన ప్రసాదాన్ని పంపిణీ చేసి దీవించారు.

చట్టాల అమలులో నిర్లక్ష్యం

వెంకటాపురం(కె): ఆదివాసీ చట్టాలను అమలు చేయటంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి ఆరోపించారు. మండల కేంద్రంలో గోండ్వానా సంక్షేమ పరిషత్ ముఖ్య కార్యకర్తల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు ఏజెన్సీ చట్టాలను గౌరవిస్తూ ఆదివాసీల అభివృద్ధికి పాటు పడాలన్నారు. ప్రభుత్వాలు మారిన పాలకులు మారిన ఆదివాసీల బతుకులు మారటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏజెన్సీ చట్టాల ఉల్లంఘన యథేచ్ఛగా సాగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఆదివాసీ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని కోరారు.

సన్న బియ్యం.. జైకొట్టి

- పోటీపడి తీసుకెళ్లిన లబ్ధిదారులు
- గత నెల కన్నా అధికంగా పంపిణీ
- హర్షం వ్యక్తం చేస్తున్న పేదలు

సాక్షి, మహబూబాబాద్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సన్న బియ్యం సరఫరా చేస్తోంది. గతంలో దొడ్డు బియ్యం పంపిణీ చేయడంతో అన్నం ముద్దగా ఉందని, తింటే అరగడం లేదని ఇబ్బంది పడిన పేదలు ఇప్పుడు సన్న బియ్యం అనగానే పోటీపడి మరీ తీసుకెళ్తున్నారు. దీంతో గత నెలతో పోలిస్తే ఈ నెల కోటా అధికంగా బియ్యం పంపిణీ చేసినట్లు అధికారులు చెబుతున్నారు. అయితే గతంలో బియ్యం తీసుకెళ్లిన వారిలో ఎక్కువ మంది తినేవారు కాదు. ఇప్పుడు మాత్రం తినేందుకే తీసుకెళ్తున్నామని లబ్ధిదారులు చెప్పడం గమనార్హం.

పోటాపోటీగా..

ప్రభుత్వం సన్నబియ్యం సరఫరా చేయడంతో రేషన్ కార్డుదారులు బియ్యం తీసుకునేందుకు పోటీపడ్డారు. ఇలా జిల్లాలోని 556 రేషన్ షాపుల ద్వారా ఆహార భద్రతాకార్డులు, అంత్యోదయ, అన్నపూర్ణ మొత్తం 2,41,012 కార్డుల్లోని 7,03,550 మందికి నెలకు 4,511 మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా చేస్తున్నారు. మార్చి నెలలో 1,65,107 రేషన్ కార్డులపై 3,254 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ చేశారు. అంటే గత నెల 68.51శాతం లబ్ధిదారులు రేషన్ బియ్యం తీసుకెళ్లారు. అదే ఏప్రిల్ నెలలో 4,602 మెట్రిక్ టన్నుల సన్నబియ్యం రేషన్ షాపులకు సరఫరా చేయగా.. తెల్లరేషన్ కార్డులు ఉన్న 1,84,089 కుటుంబాలు 3,691మెట్రిక్ టన్నుల బియ్యం తీసుకెళ్లారు. అంటే ఈనెల 80.21శాతం బియ్యం పంపిణీ చేశారు. గత నెల కంటే ఈనెల 11.7శాతం అధికం సరఫరా చేశారు.

బియ్యం వ్యాపారుల ఢీలా..

ప్రతీ నెల దొడ్డుబియ్యం రావడంతో పేదల వద్ద నుంచి కిలో రూ.7నుంచి రూ.10 వరకు కొనుగోలు చేసి రూ.14 రూపాయలకు పైగా కిలో చొప్పున పెద్ద వ్యాపారికి, రైస్ మిల్లుల యజమానులకు విక్రయించేవారు. వారు దొంగచాటున బస్తాలు మార్చి బీరు షాపులు, కోళ్ల పరిశ్రమ, ఆఫ్రికా దేశాలకు ఎగుమతి చేయడం, కొందరు మిల్లర్లు ఈ బియ్యాన్నే సీఎంఆర్‌గా పెట్టి పట్టుబడిన సంఘటనలు జిల్లాలో ఉన్నాయి. అయితే ఈ నెల సన్న బియ్యం ఇవ్వడంతో బయట మార్కెట్‌లో కిలో రూ.50కి పైగా పలుకగా.. వీటిని అమ్ముకునేందుకు లబ్ధిదారులు ఎవరూ ముందుకు రావడంలేదు. నూకను వేరు చేసి వండుకోవడం, కొద్దిరోజులు మాగపెట్టి వండుకునేందుకు నిల్వ చేసుకుంటున్నారు. దీంతో రేషన్ బియ్యం అక్రమ వ్యాపారులకు బియ్యం దొరకడం లేదు. అలాగే సాధారణ బియ్యం వ్యాపారుల సేల్స్ కూడా భారీగా తగ్గాయి.



దుకాణాల్లో రేషన్ బియ్యం పంపిణీ

రేషన్ బియ్యం పంపిణీ ఇలా.. (మెట్రిక్ టన్నులు)

నెల	మొత్తం కార్డులు	తీసుకున్న కార్డులు	సరఫరా	పంపిణీ	శాతం
మార్చి	2,41,012	1,65,107	4,511.62	3,254.64	68.51
ఏప్రిల్	2,41,012	2,20,543	4,602.16	3,691.71	80.21

తినేందుకే తీసుకెళ్లాం..



పోయిన నెల దొడ్డు బియ్యం ఇస్తే అవి వండాలంటే ఇబ్బంది పడేవాళ్లం. ముద్ద అన్నం, ఏ కూర వేసుకొని తిన్నా రుచీ పచీ ఉండేది కాదు. ఇప్పుడు సన్నబియ్యం ఇస్తున్నారు. కారం ఏసుకొని తిన్నా రుచిగానే ఉంటుంది. అందుకోసమే సన్నబియ్యం ఇస్తున్నారు అని తెలియగానే తీసుకెళ్లాను.

-కొమ్ము ఉప్పలమ్మ, చిన్నగూడూరు

అదనంగా 50 క్వింటాళ్లు పంపిణీ చేశా



ప్రతీ నెల నాకోటా కింద 86 క్వింటాళ్ల బియ్యం పంపిణీ చేస్తా. కొన్ని సార్లు బియ్యం తీసుకునేందుకు ఎక్కువ మంది రాకపోవడంతో 50 క్వింటాళ్లు కూడా పంపిణీ కాని సందర్భాలు ఉన్నాయి. ఏప్రిల్ నెలలో నాకోటా పోగా అదనంగా 50 క్వింటాళ్ల బియ్యం పంపిణీ చేశా. సన్నబియ్యం కావడంతో పేదలు సంబురంగా తీసుకెళ్తున్నారు.

-రామచందర్‌రావు, డీలర్,
వెంకటేశ్వర బజార్, మహబూబాబాద్

మరింత నాణ్యమైనవి సరఫరా చేయాలి



ప్రభుత్వం సన్న బియ్యం ఇస్తే మంచిదే. కానీ ప్రస్తుతం ఇస్తున్న సన్న బియ్యంలో నూక ఎక్కువగా ఉంది. అన్నం వండితే ముద్ద అవుతుంది. మరింత నాణ్యమైన సన్నబియ్యం సరఫరా చేస్తే పేదలకు ఉపయోగపడుతుంది. పాలిష్ ఎక్కువ పెట్టిన బియ్యం సరఫరా చేయడంతో అన్నం పగులుతుంది. వచ్చే నెల నుంచి మంచి బియ్యం ఇవ్వాలి.

-తీగల రాజు, గుర్తూరు

మంచి స్పందన వచ్చింది



ఏప్రిల్ నెలలో అన్ని రేషన్ షాపుల్లో సన్న బియ్యం పంపిణీ చేశాం. సన్న బియ్యం తీసుకునేందుకు ప్రజలు ఉత్సాహంగా షాపుల వద్దకు వచ్చారు. జిల్లాలోని కార్డుదారులే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు కూడా ఇక్కడ బియ్యం తీసుకున్నారు. పేదలు తినేందుకు అనువుగా బియ్యం ఉండడంతో అమ్ముకునేందుకు కూడా ముందుకు రారు.

-ప్రేమ్ కుమార్, డీఎస్ఓ, మహబూబాబాద్

వేసవి శిక్షణ శిబిరాలేవి?

- క్రీడా శిబిరాల ఏర్పాటులో నిర్లక్ష్యం
- సెలవుల నిమిత్తం ఊర్లకు వెళ్తున్న చిన్నారులు
- జిల్లాలో సమ్మర్ క్యాంపులపై నోరుమెదపని అధికారులు



కబడ్డీలో తలపడుతున్న క్రీడాకారిణులు(ఫైల్)

మహబూబాబాద్ అర్బన్: మానుకోట జిల్లా క్రీడలకు పుట్టినిల్లు లాంటిది. ఇక్కడి నుంచి వందలాది మంది క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి జిల్లాకు మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకొచ్చారు. ఈక్రమంలో అనేక మంది క్రీడాకారులు పలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు సాధించారు. ఇలాంటి ఘన చరిత్ర ఉన్న జిల్లాలో ఇప్పటి వరకు వేసవి శిక్షణ శిబిరాల నిర్వహణపై ఎలాంటి కదలిక లేదు. మరో రెండు రోజుల్లో పిల్లలకు వేసవి సెలవులు ప్రారంభం కానుండగా.. ఇప్పటికే పలు ప్రైవేట్ పాఠశాలలు సెలవులు ప్రకటించాయి. దీంతో చిన్నారులు సొంత ఊళ్లకు, విహారయాత్రలకు వెళ్తున్నారు.. మరికొందరు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. కాగా ఇప్పటికైనా శిబిరాలు ఏర్పాటు చేస్తే పిల్లలకు ప్రయోజనం చేకూరుతుందని క్రీడాభిమానులు కోరుతున్నారు.

క్రీడలతో మానసిక, శారీరక ఎదుగుదల..

క్రీడలు పిల్లల మానసిక, శారీరక ఎదుగుదలకు ఎంతగానో దోహదపడుతాయి. క్రీడలతో ఎముకలు, కండరాల పెరుగుదల, మంచి రక్త ప్రసరణ, వయసుకు తగ్గ పెరుగుదల ఉంటుంది. అలాగే మెదడు, గుండె చక్కగా పని చేస్తాయి. కాగా ప్రస్తుత ఆధునిక ప్రపంచంలో పిల్లలు పాఠశాలలు ఉన్నప్పుడు తరగతి గదులకే పరిమితమవుతున్నారు. చాలా తక్కువ మంది క్రీడలు ఆడుతున్నారు. ఇలాంటి వారికి సమ్మర్ శిక్షణ శిబిరాలు ఉపయుక్తంగా మారుతాయి.

సమ్మర్ క్యాంప్‌లో క్రీడలు..

మున్సిపల్ పరిధిలోని సమ్మర్ క్యాంప్‌లో బాస్కెట్‌బాల్, తైక్వాండో, క్రికెట్, అథ్లెటిక్స్, హాకీ, స్విమ్మింగ్, షటిల్ బ్యాడ్మింటన్, చెస్, క్యారమ్ తదితర క్రీడలు నిర్వహిస్తారు. అలాగే గ్రామాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, సాఫ్ట్‌బాల్, బాల్‌బ్యాడ్మింటన్, చెస్, క్యారమ్ క్రీడలు నిర్వహిస్తారు. పిల్లలకు మెరుగైన శిక్షణ ఇస్తే జాతీయ, అంతర్జాతీయ వేదికలపై మానుకోట పేరును నిలబెట్టే అవకాశం ఉంది.

పిల్లలను ప్రోత్సహించాలి



తల్లిదండ్రులు తమ పిల్లలను చిన్నతనం నుంచే ఆటల్లో ప్రోత్సహించాలి. ఆటలు ఆడడం వల్ల శారీరకంగా, మానసికంగా దృఢంగా తయారవుతారు. ఇక్కడ బాస్కెట్‌బాల్ క్రీడలో శిక్షణ తీసుకున్న పలువురు క్రీడాకారులు పలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. ప్రభుత్వం సమ్మర్ క్యాంపులు నిర్వహిస్తే విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుంది.

-మొగిలి ప్రసాద్‌రెడ్డి,
బాస్కెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

క్రీడానైపుణ్యాలు పెంపొందుతాయి



ఏడాదంతా తరగతి గదిలో కూర్చునే పిల్లల్ని సెలవుల్లో ఇంటికే పరిమితం చేయడం ఎందుకని చాలా మంది తల్లిదండ్రులు అంటున్నారు. సమ్మర్ క్రీడా క్యాంపులకు పిల్లలను పంపితే క్రీడానైపుణ్యాలు పెంపొందుతాయి. వారికి నచ్చిన క్రీడల్లో తర్ఫీదునివ్వాలి. ఇటు క్రీడలు, అటు చదువుల్లోనూ రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకుంటారు.

-జి.రాజకుమారి, పీడీ, మరిపెడ

సెల్‌ఫోన్లు, టీవీలకు పరిమితమవుతున్నారు



పిల్లలు సెల్‌ఫోన్లు, ట్యాబ్‌లు, టీవీలకు పరిమితం అవుతున్నారు. ఈ వేసవి సెలవుల్లో విద్యార్థులకు క్రీడా శిబిరాలు ఏర్పాటు చేయాలి. వేసవిలో నిర్వహించే క్రీడా క్యాంపులు, శిబిరాలపై ఇప్పటి వరకు ఎలాంటి కార్యక్రమాలు, సమావేశాలు నిర్వహించలేదు. అధికారులు స్పందించి శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలి.

-బొద్దుపల్లి ఉపేంద్రం, ఖోఖో మాజీ సీనియర్ కోచ్

శిబిరాలను నిర్వహించేలా చర్యలు



రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల ప్రకారం త్వరలోనే జిల్లా, మండలాల వారీగా క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తాం. ఆసక్తి గల క్రీడా కోచ్‌లు జిల్లా క్రీడల యువజన కార్యాలయంలో సంప్రదించాలి.

-ఓ.జ్యోతి, జిల్లా క్రీడలు, యువజనశాఖ అధికారి

సేవాలాల్ మార్గం అనుసరణీయం




భోగ్ భండారోలో పాల్గొన్న ప్రభుత్వ విప్ రాంచంద్రనాయక్, ఎంపీలు బలరాంనాయక్, రఘురాంరెడ్డి

- ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్
- ఘనంగా సంత్ సేవాలాల్ మహరాజ్ భోగ్ భండారో
- హాజరైన ఎంపీలు బలరాంనాయక్, రఘురాంరెడ్డి

మరిపెడ: సంత్ సేవాలాల్ మహరాజ్ సమాజానికి చేసిన సేవలు మరిచిపోలేనివని, ఆయన మార్గం అనుసరణీయమని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్ అన్నారు. ఆదివారం మరిపెడ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో డోర్నకల్ నియోజకవర్గస్థాయి సంత్ సేవాలాల్ భోగ్ భండారో కార్యక్రమాన్ని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మానుకోట, ఖమ్మం ఎంపీలు పోరిక బలరాంనాయక్, రామసహాయం రఘురాంరెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. సాధు పూజారులు ముందుగా బెల్లం, బియ్యం, పప్పు, నెయ్యిని ఉపయోగించి తయారు చేసిన పదార్థాలను సంత్ సేవాలాల్‌కు నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రభుత్వ విప్ మాట్లాడుతూ.. బంజారా జాతిని చీకటి నుంచి వెలుగులోకి తీసుకొచ్చిన గొప్ప విప్లవ చైతన్యమూర్తి సంత్ సేవాలాల్ మహరాజ్ అని కొనియాడారు. దేశం గర్వించదగ్గ గొప్ప ఆధ్యాత్మికవేత్తల్లో ఒకరని పేర్కొన్నారు. ముఖ్యంగా భోగ్ భండారో చేయడంలో గొప్ప శాస్త్రీయత దాగి ఉందన్నారు. ఎంపీ బలరాంనాయక్ మాట్లాడుతూ.. బంజారాల జీవనం ప్రకృతితో ముడిపడి ఉందన్నారు. మన సంస్కృతీ, సంప్రదాయాలు, భాషను కాపాడుకోవాలని సూచించారు. అనంతరం ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి మాట్లాడుతూ.. బంజారాలకు రిజర్వేషన్ కల్పించిన పార్టీ కాంగ్రెస్ అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి బంజారులు కృషి చేశారన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు భరత్‌చందర్‌రెడ్డి, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ దేశిరాంనాయక్, జిల్లా నాయకులు వంటికొమ్ము యుగేందర్‌రెడ్డి, నూకల అభినవ్‌రెడ్డి, మండలాల అధ్యక్షులు రఘువీరరెడ్డి, అంబటి వీరభద్రం, భట్టునాయక్, మారబోయిన వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షుడు తాజుద్దీన్, జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోతు రవినాయక్, మానుకోట మార్కెట్ కమిటీ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్‌నాయక్, కేసముద్రం మార్కెట్ వైస్ చైర్మన్ ఐలమల్లు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత

- ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు

మహబూబాబాద్ అర్బన్: కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో పూర్తిగా వ్యతిరేకత పెరిగిందని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసి సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. జిల్లా ఇన్‌చార్జ్, మాజీ మంత్రి సత్యవతిరాథోడ్ అందరిని సమన్వయం చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని, అధిష్టానం ఆదేశాలు పాటించడం లేదన్నారు. నాయకులు, కార్యకర్తలతో సమన్వయంతో ఉంటేనే స్థానిక ఎన్నికల్లో గెలుస్తామన్నారు. వరంగల్‌లో నిర్వహించే రజతోత్సవ సభకు వేలాదిగా తరలిరావాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఉమ్మడి వరంగల్ నుంచి రెండు లక్షలకు తగ్గకుండా సభకు హాజరవుతున్నారన్నారు. ఇప్పటికైనా మాజీ మంత్రి అందరూ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులను కలుపుకుని రజతోత్సవ సభ విజయవంతానికి కృషి చేయాలని సూచించారు. బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలోనే అన్ని సమావేశాలు నిర్వహించాలని కోరారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, మాజీ కౌన్సిలర్ ఎడ్ల వేణు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తేళ్ల శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు గద్దె రవి ఉన్నారు.

చిక్కుల్లో 'చేప'

ఎదుగూబొదుగు లేదు!

- టెండర్లు, చేప పిల్లల పంపిణీలో ఆలస్యం..
- సిండికేట్‌గా మారిన కాంట్రాక్టర్లు
- నాసిరకం, ఇష్టారాజ్యంగా సరఫరా
- 750 గ్రాముల బరువు దాటని చేపలు
- ఎండదెబ్బ.. దిగుబడిపై సన్నగిల్లిన ఆశలు
- నష్టపోతున్నామంటున్న మత్స్యకారులు



జేఎస్ భూపాలపల్లి జిల్లా ఆన్‌సాన్‌పల్లి చెరువులో చేపల వేట

సాక్షిప్రతినిధి, వరంగల్ : మత్స్యకారుల జీవనోపాధికి ప్రభుత్వం వంద శాతం రాయితీపై చేప పిల్లలను పంపిణీ చేస్తోంది. 2024-25 సంవత్సరానికి గాను ఉమ్మడి వరంగల్ పరిధి 3,861 నీటి వనరుల్లో ఈ ఏడాది 14.07 కోట్ల చేప పిల్లలు వదలాలి. 2024 జనవరిలోనే 35-40, 80-100 మిల్లీమీటర్ల పరిమాణమున్న చేప పిల్లల సరఫరాకు టెండర్లు పూర్తి చేశారు. ఆయా ప్రాంతాల్లో వాతావరణానికి తగినట్లుగా మెరిగెలు, బొచ్చె, రవ్వ, బంగారు తీగ లాంటి చేప పిల్లలను ఉత్పత్తి చేసి సరఫరా చేయాల్సి ఉంది. అయితే ఏటా టెండర్లు దక్కించుకుంటున్న గుత్తేదారు సంస్థలు స్థానికంగా పెంచకుండా ఇతర రాష్ట్రాల నుంచి తీసుకొచ్చినవి చెరువుల్లో వదిలి చేతులు దులుపుకుంటున్నారు. జూన్‌లో పంపిణీ చేయాల్సిన చేప పిల్లలను ఆగస్టులో మొదలెట్టి అక్టోబర్ వరకు పంపిణీ చేశారు. ఈలోగా కొన్ని మత్స్య సహకార సంఘాల నాయకులు, సభ్యులు డబ్బులు పోగేసుకుని చేప పిల్లలు కొనుగోలు చేసి చెరువుల్లో పోశారు. చాలాచోట్ల గుత్తేదార్లు సరఫరా చేసిన చేప పిల్లలు నాసిరకంగా ఉండగా.. వాటిలో ఇప్పటికీ ఎదుగుదల లేదని మత్స్యకారులు అంటున్నారు.

చెరువులు, చేప పిల్లల పంపిణీ వివరాలు

ఉమ్మడి జిల్లాలో చెరువులు	3,861
ఉచిత చేప పిల్లల పంపిణీ లక్ష్యం	14.07 కోట్లు
3,462 చెరువుల్లో పోసిన చేప పిల్లలు	8.88 కోట్లు
35 నుంచి 45 మిల్లీమీటర్ల చేపలు	4.89 కోట్లు
80 నుంచి 100 మిల్లీమీటర్ల చేపలు	3.99 కోట్లు
పెరగాల్సిన సైజు	1.5 కేజీ నుంచి 2.5 కేజీలు
ప్రస్తుత సైజు	450 నుంచి 750 గ్రాములు


చేప పిల్లల పంపిణీ 63.11 శాతమే

ఉమ్మడి వరంగల్‌లో 3,861 చెరువులు, కుంటలు ఉండగా.. 14.07 కోట్ల చేప పిల్లలు వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు మత్స్యశాఖ ప్రకటించింది. అయితే.. 35-40 మిల్లీమీటర్ల పిల్లలు 4.89 కోట్లు, 80-100 మిల్లీమీటర్లవి 3.99 కోట్లు.. మొత్తం 8.88(63.11 శాతం) కోట్లు పంపిణీ చేసినట్లు గణాంకాలు చెబుతున్నాయి. వాస్తవానికి జూన్ మొదటి వారం నుంచే చేప పిల్లలు చెరువుల్లో పోయాల్సి ఉంది. అలాగైతే ఆరేడు నెలల గడువులో ఒక్కో నెలకు పావుకిలో పెరిగినా రెండు, రెండున్నర కిలోలకు పెరిగే అవకాశం ఉంటుంది. కానీ ఓవైపు నాసిరకం విత్తన చేపపిల్లలు, మరోవైపు ఆలస్యంగా చెరువుల్లో వదలడం.. ఎండిపోతున్న చెరువుల్లో తీవ్రమైన ఎండవేడి.. ఈ ప్రతికూల కారణాలతో చెరువులో చేప ఎదగడం లేదు. మార్చి చివరి నుంచి చేపలు పట్టే అవకాశం ఉన్నా 450-750 గ్రాముల సైజులోనే ఉండటంతో మిన్నకుండిపోయారు. ఇప్పటికై నా ప్రభుత్వం కాంట్రాక్టర్లు, దళారులతో ఉచిత చేప పిల్లలను పంపిణీ చేయకుండా వాటికి అయ్యే మొత్తాన్ని నేరుగా మత్స్య పారిశ్రామిక సంఘాల అకౌంట్లలోకి జమ చేస్తే.. నచ్చిన చేప పిల్లలను సకాలంలో కొనుగోలు చేసి చెరువులు, కుంటల్లో పోస్తే మంచి ఫలితాలు వస్తాయని మత్స్యకారులు, సంఘాల నాయకులు అంటున్నారు.



మత్స్య సంఘం కార్యాలయంలో వలలు సరిచేసుకుంటున్న కొక్కు రాజమౌళి స్వగ్రామం నర్సంపేట నియోజకవర్గంలోని గురిజాల. ఈ గ్రామంలో మూడు చెరువులు ఉన్నాయి. మత్స్య సహకార సంఘంలో 20,080 మంది సభ్యులున్నారు. చేప పిల్లల పంపిణీ ఆలస్యం కావడంతో ఒక్కొక్కరు రూ.2,000 చొప్పున కలుపుకొని చేప పిల్లలను పెద్ద చెరువు, పెద్దమ్మ చెరువు, రంగసముద్రంలో పోసుకున్నారు. ప్రభుత్వం నుంచి అక్టోబర్‌లో 1.60 లక్షల చేప పిల్లలు పంపిణీ చేసినా.. అవి నాసిరకం కావడంతో ఎదుగుదల లేక అందరం నష్టపోయామని అంటున్నారు.


కల్తీ చేప పిల్లలతో నష్టపోతున్నాం..



ప్రభుత్వం పంపిణీ చేసిన ఉచిత చేప పిల్లలు ఆరునెలలు గడిచినా అరకిలో, ముప్పావు కిలో దశలోనే ఉన్నాయి. ఈసారి పంపిణీ చేసిన చేప పిల్లలు నాసిరకంగా ఉండటంతో పాటు అదను దాటిన తర్వాత పోయడంతో ఎదుగుదల లోపించింది. దీనికితోడు రవులు, బొచ్చెలు, బంగారు తీగల పేరిట సరఫరా చేసిన ఉచిత చేప పిల్లల్లో కల్తీ(బుర్క జాతికి చెందినవి) చేప పిల్లలు వచ్చాయి. దీంతో ఆర్థికంగా నష్టపోతున్నాం.

- తెప్ప శరత్‌కుమార్, కార్యదర్శి,
మత్స్యకారుల సంఘం, కమలాపూర్


రెండు, రెండున్నర అంగుళాలే..



లక్నవరం సరస్సులో 8 లక్షల 33వేల చేప పిల్లలు వదిలాం. గతేడాది జూన్‌లో పోయాల్సిన చేప పిల్లలను అలస్యంగా ఆగస్టు మొదటి వారంలో పోశాం. చెరువులో వదిలేటప్పుడు చేప పిల్లలు 3 అంగుళాల మీద అర ఉండాలి. రెండు, రెండున్నర అంగుళాలే ఉన్నాయి. దీంతో సైజుతో పాటు ఒక నెల ఆలస్యంగా వదలడం వల్ల చేపలు పట్టే సమయానికి అర కేజీ నుంచి కేజీ బరువు నష్టం జరుగుతుంది. దీంతో దిగుబడి అనుకున్నంత రాకపోవచ్చు.

- పి.వెంకన్న,
మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు, లక్నవరం

నగదు బదిలీ చేస్తేనే మేలు..



ప్రభుత్వం చేప పిల్లల పంపిణీకి బదులుగా సొసైటీలకు నగదు బదిలీ చేస్తే నాణ్యతతో కూడిన చేప పిల్లలను కొనుగోలు చేసుకుంటాం. ప్రభుత్వం అందించే చేప పిల్లలు చిన్న సైజులో, కొంత నాసిరకంగా ఉండటంతో బరువు పెరగక పోవడంతో దిగుబడి తగ్గుతున్నది. చిన్న పిల్లలను పెద్ద చేపలు తినడంతో మరింత నష్టం తప్పడం లేదు. నగదు బదిలీతో చేపల పంపిణీ కార్యక్రమం నడిపిస్తే.. నాణ్యమైన, కాస్త పెద్ద సైజు పిల్లలను కొనుగోలు చేసుకుంటాం.

- నీల సోమన్న,
మత్స్యసొసైటీ చైర్మన్, స్టేషన్‌ఘన్‌పూర్

క్లుప్తంగా

అంపైర్స్‌ 'వర్క్‌షాప్‌'నకు ఆహ్వానం

వరంగల్‌ స్పోర్ట్స్‌: బ్యాడ్మింటన్‌ అసోసియేషన్‌ తెలంగాణ ఆధ్వర్యంలో ఈ నెల 26 నుంచి 29వ తేదీ వరకు రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్‌ అంపైర్స్‌ వర్క్‌షాప్‌, ఎగ్జామ్‌ నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్‌ కార్యదర్శి కె. శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌ గచ్చిబౌలిలోని కొటాక్‌ గోపిచంద్‌ అకాడమీలో నిర్వహించే వర్క్‌షాప్‌, ఎగ్జామ్‌ అనంతరం సర్టిఫికేషన్‌ అందజేయనున్నట్లు పేర్కొన్నారు. మూడు రోజుల పాటు ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటల వరకు జరగనున్న వర్క్‌షాప్‌లో పాల్గొనే వారు ఏదైనా డిగ్రీ చదవి, తెలంగాణ వారై ఉండి, 21 సంవత్సరాల వయసు కలిగి ఉండాలని పేర్కొన్నారు. వర్క్‌షాప్‌లో పాల్గొనే అభ్యర్థులు తప్పనిసరిగా యూనిఫాం కలిగి ఉండాలని, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం టీ, స్నాక్స్‌ మాత్రమే అందజేయనున్నట్లు, వసతి, ఇతర అలవెన్సులు కల్పించబడవని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 22వ తేదీలోగా బ్యాడ్మింటన్‌ అసోసియేషన్‌ జిల్లా కార్యదర్శుల లెటర్‌ హెడ్‌పై దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు.

అక్రమంగా నిల్వ ఉంచిన పేలుడు పదార్థాలు స్వాధీనం

దామెర: అక్రమంగా నిల్వ ఉంచిన పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్న ఘటన ఆదివారం హనుమకొండ జిల్లా దామెర మండలం పసరగొండ గ్రామశివారులో చోటుచేసుకుంది. టాస్క్‌ఫోర్స్‌ ఏసీపీ మధుసూదన్‌, సీఐ శ్రీధర్‌, దామెర ఎస్సై కొంక అశోక్‌ కథనం ప్రకారం.. పసరగొండ గ్రామ శివారులోని శ్రీ సాయి ఇన్‌ఫ్రా క్రషర్‌లో సూపర్‌ వైజర్‌గా పనిచేస్తున్న మంద నాగరాజు గ్రామం సమీపంలో ఎలాంటి అనుమతులు లేకుండా పేలుడు పదార్థాలు దాచి ఉంచాడు. దీనిపై విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించి 400 జిలెటిన్‌ స్టిక్స్‌, 150 డిటోనేటర్లు, డిటోనేటర్‌ ఫ్యూజు వైర్లు, 45 కిలోలు అమోనియా నైట్రేట్‌ స్వాధీనం చేసుకున్నారు. అనంతరం మంద నాగరాజుపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించినట్లు వారు పేర్కొన్నారు.

సజ్జ కూలి మేస్త్రీ మృతి

- నాగిరెడ్డిపల్లిలో ఘటన


వెంకటేశ్వర్లు మృతదేహం


బచ్చన్నపేట : నూతన ఇంటి సజ్జ కూలి మీదపడడంతో ఓ మేస్త్రీ మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని నాగిరెడ్డిపల్లిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల జిల్లా బల్లికురువ మండలం పాలెం గ్రామానికి చెందిన అచ్చి వెంకటేశ్వర్లు (61) సిద్దిపేట జిల్లా చేర్యాల పట్టణంలో నివాసముంటున్నాడు. చుట్టు పక్కల గ్రామాల్లో నూతన ఇంటి నిర్మాణ పనులకు వెళ్తున్నాడు. ఇందులో భాగంగా ఆదివారం మండలంలోని నాగిరెడ్డిపల్లిలో కూడా నూతన ఇంటి నిర్మాణ పనులకు వెళ్లాడు. తొమ్మిది రోజుల క్రితం పోసిన సజ్జల సెంట్రింగ్‌ బాక్స్‌లను తొలగిస్తుండగా సజ్జ కూలి మీదపడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎస్‌కే. హమీద్‌ తెలిపారు. కాగా, మృతుడికి కూతురు ఉంది.

రాంకీ విల్లాలో చోరీ

- రూ.12 లక్షల మేర బంగారం, నగదు అపహరణ

వరంగల్‌: వరంగల్‌ రైల్వేస్టేషన్‌ సమీపంలోని రాంకీలోని 52 నంబర్‌ విల్లాలో చోరీ జరిగింది. ఈ ఘటనలో సుమారు రూ.12 లక్షల వరకు అపహరణకు గురయ్యాయని పోలీసులు పేర్కొన్నారు. ఇంతేజార్‌గంజ్‌ ఇన్‌స్పెక్టర్‌ షుకూర్‌ కథనం ప్రకారం.. ఈ విల్లాలో అద్దెకుంటున్న వారు ఆదివారం మధ్యాహ్నం నగరంలో జరిగిన ఓ ఫంక్షన్‌కు హాజరయ్యారు. తిరిగి సాయంత్రం 6 గంటలకు వచ్చేసరికి ఇంటి తలుపులు పగులగొట్టి ఉన్నాయి. దీంతో లోపలికి వెళ్లి పరిశీలించగా బీరువాలో భద్రపరిచిన 10తులాల బంగారంతో పాటు సుమారు రూ.లక్షన్నర నగదు, రిజిస్ట్రేషన్‌ పేపర్లు కనిపించలేదు. దీంతో బాధితులు లబోదిబోమంటూ పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు హుటాహుటిన క్లూస్‌టీంతో ఘటనా స్థలికి చేరుకున్నారు. సీసీ ఫుటేజీని పరిశీలించారు. అనంతరం బాధితులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్‌ షుకూరు తెలిపారు.

పిడుగుపాటుకు కూలిన పౌల్ట్రీ ఫామ్‌


కూలిన పౌల్ట్రీ ఫామ్‌

బచ్చన్నపేట : పిడుగుపాటుకు పౌల్ట్రీ ఫామ్‌ కూలి కోళ్లు మృత్యువాత పడిన ఘటన మండలంలోని నక్కవానిగూడెంలో జరిగింది. బాధితుడి కథనం ప్రకారం.. శనివారం రాత్రి గాలిదుమారంతో పాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఈ క్రమంలో పిడుగు పడి పౌల్ట్రీ ఫామ్‌ కూలింది. దీంతో 500 కోళ్లు మృత్యువాత పడ్డాయి. ఈ ఘటనలో రూ. 5 లక్షల నష్టం వాటిల్లిందని బాధితుడు లబోదిబోమన్నాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

'పట్టు'.. రాయితీ కొట్టు..


మల్బరీ తోట


పట్టు గూళ్ల షెడ్డు

'మల్బరీ'కి ప్రోత్సాహం

- పంట సాగుకు 'సిల్క్‌ సమగ్ర పథకం'
- రైతుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

డోర్నకల్‌ : రైతులు ఆర్థికాభివృద్ధి సాధించడమే ధ్యేయంగా ప్రభుత్వం మల్బరీ సాగు, పట్టు పరిశ్రమను ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా 'సిల్క్‌ సమగ్ర పథకం' ద్వారా అన్నదాతలకు మేలు చేకూర్చడానికి రాయితీలు కల్పిస్తోంది. ప్రతీ సంవత్సరం పట్టు గూళ్ల ధర పెరుగుతుండడంతోపాటు జనగామ, హైదరాబాద్‌ మార్కెట్‌లో డిమాండ్‌ ఉండడంతో రైతులకు ఉద్యాన పట్టుపరిశ్రమ శాఖ రాయితీలు అందించి ప్రోత్సహిస్తోంది. ఇతర వాణిజ్య పంటల కన్నా మల్బరీ, పట్టుపరిశ్రమతో అధిక లాభాలు వస్తుండడంతో రైతులకు అవగాహన కల్పించి సాగును పెంచేందుకు ప్రణాళికలు రూపొందిస్తోంది. సిల్క్‌ సమగ్ర పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ, జనరల్‌ రైతులకు వేర్వేరు రాయితీలు ప్రకటించింది.

మల్బరీ సాగుకు అనుకూలాంశాలు..

మల్బరీ సాగుకు నీటి అవసరం తక్కువ ఉంటుంది. ఈ మొక్కలు ఒకసారి నాటితే 10 నుంచి 15 ఏళ్ల వరకు దిగుబడినిస్తాయి. నల్ల రేగడి, చౌడు భూములు మినహా మిగతా భూములన్నీ సాగుకు అనుకూలంగా ఉంటాయి. రెండెకరాల్లో మల్బరీ సాగు చేస్తే మొదటి ఏడాది రెండు నుంచి మూడు పంటలు తీసుకుని రూ.2 లక్షల ఆదాయం పొందొచ్చు. రెండో సంవత్సరం నుంచి 6 నుండి 7 పంటలు తీసుకుని రూ.4 లక్షల ఆదాయం పొందొచ్చు. క్రిమి సంహారక మందుల వినియోగం అవసరం ఉండదు.

దరఖాస్తులకు ఆహ్వానం..

మల్బరీ సాగు, పట్టుపరిశ్రమ ఏర్పాటుకు ఆసక్తి కలిగిన రైతులు ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖకు దరఖాస్తు చేసుకోవచ్చు. మహబూబాబాద్‌ జిల్లాకు చెందిన రైతులు బి.వెంకన్న(పట్టుపరిశ్రమ అధికారి, 8977714628), కె.సురేశ్‌(సహాయ పట్టుపరిశ్రమ అధికారి, 8977714605), డి.రాజయ్య(సహాయ పట్టుపరిశ్రమ అధికారి 897771468) సంప్రదించాలి.

రైతులకు రాయితీలు(రూపాయల్లో)..

వివరాలు	జనరల్‌	ఎస్సీ/ఎస్టీ
రెండెకరాల మల్బరీ సాగుకు	60,000	78,000
నీటి సదుపాయానికి	55,000	65,000
పట్టుపురుగుల రేలింగ్‌ షెడ్‌ నిర్మాణం	2,25,000	2,92,500
పరికరాలకు	37,500	48,750
రోగనిరోధక మందులకు	2,500	3250
కిసాన్‌ నర్సరీ ద్వారా మొక్కల పెంపకం కోసం	75,000	97,500
మొత్తం	4,50,000	5,85,000

రాయితీలతో ప్రోత్సహిస్తున్నాం



మల్బరీ సాగు, పట్టుపరిశ్రమ పెంపు కోసం రాయితీలతో రైతులను ప్రోత్సహిస్తున్నాం. పత్తి, మిరప, వరి పంటలకు ప్రత్యామ్నాయ పంటగా మల్బరీ సాగు లాభదాయకంగా ఉంటుంది. సాగు కోసం రైతులు పట్టుపరిశ్రమ శాఖ అధికారులను సంప్రదించాలి.

-ఏ. ముత్యాలు, పట్టుపరిశ్రమశాఖ ఉపసంచాలకుడు, మహబూబాబాద్‌

వసూల్‌@94.60 శాతం

ఉమ్మడి జిల్లా జీపీల్లో పన్నుల కలెక్షన్‌

- మొదటి స్థానంలో జనగామ, రెండో స్థానంలో హనుమకొండ, ములుగు
- మూడో స్థానంలో భూపాలపల్లి, మహబూబాబాద్‌, వరంగల్‌ జిల్లాలు



వరంగల్‌: ఉమ్మడి వరంగల్‌ జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో ఆస్తి పన్నులను పంచాయతీ అధికారులు 94.60 శాతం వసూలు చేశారు. గ్రామాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే నిధులు ఎంత కీలకమో.. పంచాయతీల్లో వసూలు చేసే పన్నులు అంతే అవసరం. ఏడాదిగా ఎస్‌ఎఫ్‌సీ, 15వ ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయాయి. దీంతో పంచాయతీలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాయి. గ్రామాల్లో సమస్యలు పరిష్కరించుకోవాలంటే పన్నులే ప్రధాన ఆదాయ వనరు. జూన్‌లో నిర్వహించాల్సిన స్థానిక సంస్థల ఎన్నికలు వాయిదా పడడంతో కేంద్రం నుంచి వచ్చే నిధులు నిలిచిపోయాయి. నిధులు రాకపోవడంతో పంచాయతీల్లో పాలన మొత్తం పడకేసింది. ఏ పనిచేయాలన్నా నిధులు అవసరం కావడం, కేంద్రం గ్రాంట్లు రాకపోవడంతో అధికార యంత్రాంగం ఆస్తి పన్నులపై ప్రత్యేక దృష్టి సారించింది. ఆర్థిక సంవత్సరం చివరి నాటికి 90 శాతం మార్కును దాటారు. ఉమ్మడి వరంగల్‌ జిల్లా పరిధిలోని జనగామ, హనుమకొండ, జయశంకర్‌ భూపాలపల్లి, మహబూబాబాద్‌, ములుగు, వరంగల్‌ జిల్లాల్లో 1,711 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 2023–24 బకాయిలతో కలుపుకుని 2024–25 నాటికి ఇంటి పన్నుల మొత్తం రూ.27,40,62,566 డిమాండ్‌ ఉంది. 2025 మార్చి 31 నాటికి ఉన్న డిమాండ్‌లో రూ.25,92,78,159 (94.60 శాతం) వసూలు చేశారు. జిల్లాల వారీగా వసూళ్లలో జనగామ 99 శాతంతో మొదటి స్థానం, 95 శాతంతో హనుమకొండ, ములుగు రెండో స్థానం, 93 శాతంతో జయశంకర్‌ భూపాలపల్లి, మహబూబాబాద్‌, వరంగల్‌ జిల్లాలు మూడో స్థానంలో ఉన్నాయి.

ఉమ్మడి వరంగల్‌ జిల్లాలో పన్నుల వసూళ్ల వివరాలు..

జిల్లా	పంచాయతీలు	డిమాండ్‌ (రూపాయల్లో)	వసూలు (రూపాయల్లో)	శాతం
హనుమకొండ	210	5,63,70,146	5,38,32,729	95
జనగామ	280	3,73,65,730	3,68,69,551	99
జయశంకర్‌ భూపాలపల్లి	248	4,01,91,861	3,73,04,138	93
మహబూబాబాద్‌	482	4,94,38,480	4,59,95,411	93
ములుగు	174	4,24,22,580	4,04,64,794	95
వరంగల్‌	317	4,82,73,769	4,48,115,36	93

ఉద్యమాన్ని సంఘటితం చేసిన ఘనత టీజేఎఫ్‌దే

- టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ

హన్మకొండ: తెలంగాణ రాష్ట్ర సాధనకోసం మొదలైన మలిదశ ఉద్యమ పోరాటంలో 2001లో నాటి టీఆర్‌ఎస్‌ పార్టీ పురుడుపోసుకున్న నెల రోజులకే పుట్టిన మొదటి రాజకీయేతర వేదిక తెలంగాణ జర్నలిస్టుల వేదిక అని, నాటి ఉద్యమంలో అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలను సమన్వయం చేస్తూ ఉద్యమాన్ని సంఘటితం చేసిన ఘనత తెలంగాణ జర్నలిస్టు ఫోరం(టీజేఎఫ్‌)దేనని ప్రెస్‌ అకాడమీ మాజీ చైర్మన్‌, టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ అన్నారు. తెలంగాణ జర్నలిస్టు ఫోరం ఆవిర్భవించి మే 31 నాటికి 25 ఏళ్లకు చేరుకుంటు న్న సందర్భంగా ఆదివారం హనుమకొండ నగర శివారులోని ఓ హోటల్‌లో రజతోత్సవ సభ నిర్వహణ సన్నాహక సమావేశం జరిగింది. అల్లం నారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతీ సాగర్‌, ఉపాధ్యక్షుడు రమేశ్‌ హజారి, కోశాధికారి యోగానంద్‌, తెలంగాణ ఎలక్ట్రానిక్‌ మీడియా జర్నలిస్టు యూనియన్‌ రాష్ట్ర అధ్యక్షుడు విష్ణు వర్ధన్‌ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రమణ కుమార్‌తోపాటు సీనియర్‌ జర్నలిస్టులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో అల్లం నారాయణ మాట్లాడుతూ జర్నలిజం వృత్తిలో భాగమైన తటస్థ విధానాన్ని పక్కన పెట్టి తె లంగాణ కోసమే తెలంగాణ జర్నలిస్టు అనే నినాదంతో ఉద్యమంలో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా జర్నలిస్టులు పోరాడారన్నారు. సమావేశంలో సీనియర్‌ జర్నలిసుల్టు బుచ్చన్న, సీహెచ్‌. సుధాకర్‌, బీఆర్‌ లెనిన్‌, తడక రాజ్‌ నారాయణ, పెరుమాండ్ల వెంకటేశ్వర్లు, తుమ్మ శ్రీధర్‌రెడ్డి, కక్కెర్ల అనిల్‌ కుమార్‌, టీయూడబ్ల్యూజే హనుమకొండ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మస్కపురి సుధాకర్‌, అర్షం రాజ్‌ కుమార్‌, తదితరులు పాల్గొన్నారు.

అండర్‌–7 చెస్‌ విజేత దేవాన్ష్‌రెడ్డి


విజేతలతో ముఖ్య అతిథి విముక్తీశ్వర్‌

వరంగల్‌ స్పోర్ట్స్‌: వరంగల్‌ జిల్లా చదరంగ సమాఖ్య ఆధ్వర్యంలో హనుమకొండ నక్కలగుట్టలోని ఎస్‌ఎంఆర్‌ హైస్కూల్‌లో నిర్వహించిన ఉమ్మడి వరంగల్‌ జిల్లా స్థాయి అండర్‌–7 చదరంగ పోటీలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. ఉమ్మడి జిల్లా నుంచి 14 మంది బాలబాలికలు పాల్గొన్న ఈ పోటీల్లో బైరి దేవాన్ష్‌ రెడ్డి విజేతగా నిలిచినట్లు నిర్వహణ కార్యదర్శి పి. కన్నా తెలిపారు. ద్వితీయ స్థానంలో అక్షాంత్‌ చౌహాన్‌, తృతీయ స్థానంలో వింజమూరి వీయాన్స్‌, వేనం హితాన్స్‌, బాలికల విభాగంలో మనీషాగాయత్రి, రన్వికతేజ, ఎం. నిత్య, చైత్రపూర్ణిమ వరుస నాలుగు స్థానాల్లో నిలిచినట్లు తెలిపారు. విజేతలు మే 10, 11 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ ముగింపు వేడుకలకు ఎస్‌ఎంఆర్‌ స్కూల్‌ కరస్పాండెంట్‌ వెలగందుల విముక్తీశ్వర్‌ హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్బిటర్లు ప్రేమ్‌సాగర్‌, బైరి రఘువీరారెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వడదెబ్బతో ఛత్తీస్‌గఢ్‌ వలస కూలీ మృతి

వెంకటాపురం(కె): ములుగు జిల్లా వెంకటాపురం(కె) మండల పరిధి వీరభద్రవరం గ్రామ సమీప గోదావరి ఇసుకలో ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వలస కూలీ వడదెబ్బతో మృతి చెందాడు. ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్‌ జిల్లా, సుసునూరు గ్రామానికి చెందిన పూనెం సన్ను(32) వీరభద్రవరం గ్రామ సమీపంలో మిర్చి తోటలో పనిచేసేందుకు వచ్చాడు. ఆదివారం పని చేస్తున్న సమయంలో వడదెబ్బ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడని పోలీసులు తెలిపారు.

సంగెంలో ఆదిమానవుల సమాధులు

- డిస్కవరీ బృందం సభ్యులు కూన ప్రతాప్‌, గుండా ఓంకార్‌


బోడ గుట్టపై ఆదిమానవుల సమాధులు చూపుతున్న ప్రతాప్‌

సంగెం: వరంగల్‌ జిల్లా సంగెం మండలం నల్లబెల్లి రెవెన్యూ శివారు బాలునాయక్‌తండాలో(బోడబోల్లు) బోడగుట్టలపై పెద్ద రాతి యుగపు ఆదిమానవుల సమాధులను డిస్కవరీ బృందం సభ్యులు కూన ప్రతాప్‌, గుండా ఓంకార్‌ గుర్తించారు. ఈ మేరకు వారు ఆదివారం వివరాలు వెల్లడించారు. ఈ సమాధులు క్రీ.పూ. 3500 నుంచి 1000 సంవత్సరాల నాటివని, ఈ రెండు గుట్టల మీద సుమారు 15 డోల్‌మన్‌ సమాధులు ఉన్నట్లు పేర్కొన్నారు. పాత మధ్యరాతి యుగాల్లో పెద్ద బండలను కదిలించలేని ఆదిమానవులు.. పెద్ద రాతి యుగానికి వచ్చే సరికి తెలివి , నైపుణ్యం మెరుగుపరుచుకుని పెద్ద రాళ్లను సైతం కదిలించి ఇలా సమాధులు సుస్థిరంగా ఉండేలా నిర్మించుకున్నారని తెలిపారు. నేటి ఆధునిక మానవులకు నాటి సమాధుల గురించి తెలియక గుట్టలతో పాటు సమాధులను సైతం ధ్వంసం చేస్తున్నారని పేర్కొన్నారు. పాత రాతి యుగం, మధ్యరాతి యుగాల్లో ఆదిమానవులు కొండ గుహల్లో జీవించేవారని, కాల క్రమంలో కొండల నుంచి కిందకు దిగి నివాసాన్ని ఏర్పాటు చేసుకున్నట్లు వివరించారు. ఈ బోడ గుట్ట కింద ఉన్న పాటిగడ్డ మీద నాటి పెద్ద రాతి యుగపు ఆదిమానవులు ఉపయోగించిన మృణ్మయ పత్రాలు, రాతి పనిముట్లు ఇప్పటికీ ఉన్నాయన్నారు. కాగా, కొన్ని సమాధులు ధ్వంసమై ఉన్నాయని, చరిత్ర కలిగిన సమాధులు, గుట్టలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని వారు సూచించారు.

ఆదివాసీలపై పెరిగిన దాడులు

- ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్‌ పెరుమాళ్‌


మాట్లాడుతున్న ఏఐసీసీ కార్యదర్శి పెరుమాళ్‌

హన్మకొండ: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆదివాసీలపై దాడులు, లైంగికదాడులు పెరిగాయని ఏఐసీసీ సెక్రటరీ విశ్వనాథన్‌ పెరుమాళ్‌ అన్నారు. హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో ఆదివాసీ కాంగ్రెస్‌ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'బునియాదీ కార్యకర్త సమ్మేళన్‌' రెండో రోజు శిక్షణ ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో విశ్వనాథన్‌ పెరుమాళ్‌ మాట్లాడుతూ ఆదివాసులను వనవాసులుగా మార్చి తరతరాలుగా భూమి మీద ఉన్న హక్కులను తొలగించాలని బీజేపీ కుట్రలు చేస్తోందని ధ్వజమెత్తారు. ఆదివాసీ సంస్కృతిని కలుషితం చేయడం కోసం మనువాద సంస్కృతిని రుద్దుతున్నారని ఆరోపించారు. ఆదివాసీల్లో నాయకత్వాన్ని పెంపొందించడానికి ఆదివాసీ కాంగ్రెస్‌ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ట్రైనింగ్‌ క్యాంపు నిర్వహిస్తున్నామన్నారు. ఆదివాసులు ఆత్మగౌరవంతో బతుకడానికి కారణం కాంగ్రెస్‌ తీసుకొచ్చిన రాజ్యాంగమేనన్నారు. ఈ రాజ్యాంగం లేకుండా చేసే కుట్రలను బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌ చేస్తున్నాయన్నారు. 'తెలంగాణలో ఆదివాసీ ఉద్యమాలు– ప్రత్యేక రాష్ట్రంలో ఆదివాసుల పాత్ర' అనే అంశంపై తెలంగాణ ఉద్యమ నాయకుడు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్‌ కోదండరాం, 'భారత రాజ్యాంగం –ఆదివాసీ సంస్కృతి' అనే అంశంపై సీనియర్‌ జర్నలిస్ట్‌ రవి, 'భారత రాజ్యాంగం, సామాజిక న్యాయం, ఆదివాసుల పాత్ర' అనే అంశంపై కాకతీయ యూనివర్సిటీ రిటైర్డ్‌ ప్రొఫెసర్‌ ప్రొఫెసర్‌ వెంకటనారాయణ, 'భారత రాజ్యాంగం – ఆదివాసీ ఉద్యమాలు' అనే అంశంపై తెలంగాణ ఉద్యమకారుడు ఇన్నయ్య, 'భారత రాజ్యాంగం – కాంగ్రెస్‌ పార్టీ – ఆదివాసీల నాయకత్వం' అనే అంశంపై ప్రొఫెసర్‌ కంచ ఐలయ్య, 'ఆదివాసీలు– కాంగ్రెస్‌ విధానాలు' అనే అంశంపై ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌, 'ఆదివాసీ సంస్కృతి పరిరక్షణ– కాంగ్రెస్‌ పార్టీ బాధ్యతలు' అనే అంశంపై డాక్టర్‌ రియాజ్‌ ప్రసంగించారు. కార్యక్రమంలో ఆదివాసీ కాంగ్రెస్‌ రాష్ట్ర అధ్యక్షుడు బెల్లయ్య నాయక్‌, నాయకులు రాహుల్‌ బాల్‌, ఎమ్మెల్యే కె.ఆర్‌.నాగరాజు, నాయకులు గుగులోత్‌ రవీందర్‌ నాయక్‌, రవళి, వినోద్‌ లోక్‌ నాయక్‌, తిరుపతి నాయక్‌, చంద్రకళ, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రజానీకానికి కాంగ్రెస్‌ ద్రోహం

- శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి


సభ ఏర్పాట్లు పరిశీలిస్తున్న మధుసూదనాచారి

ఎల్కతుర్తి: ఎన్నికల్లో అనేక వాగ్దానాలు చేసి అమలు చేయకుండా తెలంగాణ ప్రజానీకానికి కాంగ్రెస్‌ ప్రభుత్వం ద్రోహం చేసిందని శాసనమండలి ప్రతి పక్ష నేత సిరికొండ మధుసూదనాచారి విమర్శించారు. ఈ నెల 27న హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం చింతలపల్లి సమీపంలో నిర్వహించనున్న బీఆర్‌ఎస్‌ రజతోత్సవ సభాస్థలిలో జరుగుతున్న ఏర్పాట్లను ఆదివారం బీఆర్‌ఎస్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గ్యాదరి బాలమల్లు, మాజీ మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ చింతం సదానందంతో కలిసి పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మధుసూదనాచారి మాట్లాడుతూ 14 ఏళ్ల ఉద్యమం తర్వాత పదేళ్ల బీఆర్‌ఎస్‌ హయాంలో కేసీఆర్‌ అద్భుత పాలన అందించారన్నారు. దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని రోల్‌ మోడల్‌గా నిలబెట్టారని వివరించారు. గడిచిన 16 మాసాల కాలం నుంచి కాంగ్రెస్‌ ప్రజలను మోసం చేస్తూనే ఉందన్నారు. తెలంగాణ ప్రజల ప్రయోజనాలకు భిన్నంగా వ్యవహరించడం కాంగ్రెస్‌ నైజమని దుయ్యబట్టారు. హుస్నాబాద్‌ నుంచి వస్తుంటే చెరువులన్నీ ఎండిపోయి ఉన్నాయని, సంవత్సరంన్నర క్రితం జలాశయాలన్నీ నీటితో కళకళలాడేవని గుర్తు చేశారు. ప్రపంచం మెచ్చుకునే రీతిలో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి తాగు, సాగునీరు కష్టాలు లేకుండా చేసిన నేత కేసీఆర్‌ అని కొనియాడారు. ఇప్పుడు కాళేశ్వరం నీటిని వాడుకునే చిత్తశుద్ధి కాంగ్రెస్‌కు లేదన్నారు. ఇదిలా కొనసాగితే తెలంగాణలో కరువు, కాటకాలు వచ్చే ప్రమాదం ఉందన్నారు. తెలంగాణ ప్రయోజనాలకు ద్రోహం కలుగుతుంటే ప్రజల తరఫున గొంతు విప్పడానికే కేసీఆర్‌ సభ నిర్వహిస్తున్నారని చెప్పారు. అందుకే రాష్ట్రంలోని ప్రతీ ఇంటి నుంచి తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. అంతకు ముందు మునుగోడు, భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యేలు కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, గండ్ర వెంకటరమణారెడ్డి సభాస్థలిని పరిశీలించారు.

తాన్యశ్రీకి గిన్నిస్‌ బుక్‌లో చోటు


అవార్డుతో తాన్యశ్రీ

పాలకుర్తి : మండలంలోని ఎల్లరాయని తొర్రూరుకు చెందిన చిన్నారి తాన్యశ్రీ కూచిపూడి నాట్యంలో అద్భుత ప్రతిభ కనబర్చి గిన్నిస్‌ బుక్‌లో చోటు సంపాదించుకుంది. ఈ మేరకు ఆదివారం నిర్మల్‌ పట్టణ కేంద్రంలో స్వరూపిణీ నిత్య కళాక్షేత్రం ఆధ్వర్యంలో 2025 గిన్నిస్‌ వరల్డ్‌ రికార్డ్‌ సక్సెస్‌ మీట్‌ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా 18 నెలల క్రితం కూచిపూడి నాట్యంలో ప్రతిభ కనబర్చిన తాన్యశ్రీకి సర్టిఫికెట్లు, మోడల్స్‌ పంపిణీ చేశారు. దీంతో మాజీ ఎంపీటీసీ మడిపల్లి కౌసల్య, సోమయ్య, మాజీ సర్పంచ్‌ నాయిని మల్లారెడ్డి, మడిపల్లి దామోదర్‌, గ్రామస్తులు అభినందించారు.

విద్య మాఫియాను అడ్డుకోవాలి

- వరంగల్‌, నల్లగొండ, ఖమ్మం టీచర్‌ ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్‌రెడ్డి

మహబూబాబాద్‌ అర్బన్‌: కార్పొరేట్‌ విద్య మాఫియాను అడ్డుకుని ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థులు ఇంగ్లిష్‌లో మాట్లాడేలా తీర్చిదిద్దాలని వరంగల్‌, నల్లగొండ, ఖమ్మం జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులను కోరారు. ఈ మేరకు ఆదివారం జిల్లా కేంద్రంలోని బాలాజీ గార్డెన్‌లో ప్రొగ్రెసివ్‌ రికగ్నైజ్‌ టీచర్స్‌ యూనియన్‌ తెలంగాణ ఆధ్వర్యంలో ఆత్మీయ అభినందన సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఉపాధ్యాయుల గొంతుకై నిలబడి వారి సమస్యలు పరిష్కారం చేస్తామన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చడానికి కృషి చేస్తానన్నారు. పేదలు చదువుకునే ప్రభుత్వ పాఠశాలలు బలోపేతానికి ప్రభుత్వానికి పలు సూచనలు చేసి విద్యా వ్యవస్థ పటిష్టానికి సహకరిస్తామన్నారు. ఏపార్టీకి అనుబంధంగా ఉండకుండా ఉపాధ్యాయ సంక్షేమమే ఎజెండాగా, ధ్యేయంగా పనిచేస్తానన్నారు. సీపీఎస్‌ రద్దు కోసం ప్రభుత్వంతో చర్చలు జరుపుతానని, కాంట్రిబ్యూషన్‌తో నూతన హెల్త్‌ కార్డులు, ప్రతీ సంవత్సరం మేలో బదిలీలు, పదోన్నతులు నిర్వహిస్తామన్నారు. కేజీబీవీ, గిరిజన ఆశ్రమ పాఠశాల, మోడల్‌ స్కూళ్లలో కాంట్రాక్ట్‌ ఉపాధ్యాయులకు టైంస్కేల్‌, ప్రైవేట్‌ ఆస్పత్రుల్లో రూపాయి ఖర్చు లేకుండా వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రైవేట్‌ పాఠశాల, ఉపాధ్యాయుల, ప్రభుత్వ అధ్యాపకులకు హెల్త్‌ కార్డులు అందిస్తామని, వారి సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో వరంగల్‌, ఖమ్మం, హనుమకొండ, మానుకోట జిల్లా అధ్యక్షులు సంకా బద్రీనారాయణ, మిర్యాల సతీశ్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, రవీందర్‌రెడ్డి, వైవీరావు, వివిధ సంఘాల అధ్యక్షులు వడ్డెబోయిన శ్రీనివాస్‌, శ్రీధర్‌రావు, యాకయ్య, రఫీ, నాగిరెడ్డి, ఏఐఎఫ్‌టీఓ ఉపాధ్యక్షులు గీత, పీఆర్టీయూ రాష్ట్ర నాయకులు హల్యానాయక్‌, రాంజీనాయక్‌, చిట్టిబాబు, సుజాత, నాగరాజు, కనకయ్య, వెంకన్న, పూర్ణచందర్‌, సునీత, సంగీత, మమత, సుశీల తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌ పామ్‌ సాగుతో అధిక లాభాలు


పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త రాజశేఖర్‌ రెడ్డి

వేలేరు: ఆయిల్‌ పామ్‌ సాగుతో రైతులు అధిక లాభాలు పొందొచ్చని సీనియర్‌ శాస్త్రవేత్త రాజశేఖర్‌ రెడ్డి,కేవీఎస్‌ బయోసైన్స్‌ ఎండీ సుధారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని గుండ్లసాగర్‌లో కేవీఎస్‌ బయో సైన్స్‌ కంపెనీ ఆధ్వర్యంలో ఆయిల్‌ పామ్‌ తోటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈసందర్భంగా వారు రైతులకు పలు సూచనలు చేశారు. వేసవిలో సరిపడ నీరు లేకపోతే మొక్కల్లో వచ్చే లోపాలు, వాటి యాజమాన్య పద్ధతులను వివరించారు. ఆయిల్‌పామ్‌ సాగులో సేంద్రియ ఎరువులను మాత్రమే వాడాలని సూచించారు. ప్రభుత్వం ఆయిల్‌ పామ్‌ రైతులకు పెద్ద ఎత్తున ప్రోత్సాహకాలు అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కంపెనీ డైరక్టర్‌ కుషాల్‌ రెడ్డి, జిల్లా మేనేజర్‌ రంజిత్‌, ఫీల్డ్‌ ఆఫీసర్లు విక్రమ్‌, మహిపాల్‌ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం 'ఆపరేషన్‌ కగార్‌' ఆపాలి

- హైకోర్టు రిటైర్డ్‌ న్యాయమూర్తి జస్టిస్‌ చంద్రకుమార్‌


సదస్సులో మాట్లాడుతున్న హైకోర్టు రిటైర్డ్‌ న్యాయమూర్తి జస్టిస్‌ చంద్రకుమార్‌

నెహ్రూసెంటర్‌ : కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్‌ కగార్‌ పేరుతో ఆదివాసీ, గిరిజనులపై కొనసాగిస్తున్న దాడులు, హత్యాకాండను వెంటనే నిలిపివేయాలని హైకోర్టు రిటైర్డ్‌ న్యాయమూర్తి జస్టిస్‌ చంద్రకుమార్‌ డిమాండ్‌ చేశారు. ఆదివారం ఏఐకేఎంఎస్‌, తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో జిల్లాస్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హైకోర్టు రిటైర్డ్‌ న్యాయమూర్తి జస్టిస్‌ చంద్రకుమార్‌, ఏఐకేఎంఎస్‌ జాతీయ అధ్యక్షురాలు టాన్యా మాట్లాడుతూ.. అటవీ సంపదను కార్పొరేట్‌ శక్తులకు కట్టబెట్టేందుకు మధ్య భారతంలో మారణహోమం సృష్టిస్తున్నారని ఆరోపించారు. అటవీప్రాంతంలోని ఆదివాసీలపై జరుగుతున్న దాడులు, హత్యలపై సుప్రీంకోర్టు సిట్టింగ్‌ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్‌ చేశారు. ప్రభుత్వాలను ప్రశ్నించిన వారిని నిర్బంధిస్తూ, నక్సలైట్లుగా ముద్రవేసి ఆదివాసీ జాతి హననానికి పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమలు, పర్యాటక ప్రాంతాల పేరుతో అడవులను కొల్లగొట్టేందుకు కుట్రలు చేస్తున్నారని వివరించారు. పీసాచట్టం–2006 అమలు చేయాలని, ఆదివాసీల జీవించే హక్కు, భూమి హక్కును కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. సదస్సులో ఏఐకేఎంఎస్‌ రాష్ట్ర నాయకుడు ప్రసాద్‌, మదార్‌, సాయిలు, కొటమ్మ, వెంకటేశ్వర్లు, పొమ్మన్న, ఆనంద్‌, కె.భాస్కర్‌రెడ్డి, జీవన్‌, రాంచందర్‌, ఉపేందర్‌, రాంసింగ్‌, సురేందర్‌, ఉమ, అశోక్‌, ఐలయ్య, కృష్ణ, గొడయ్య, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.